క్లుప్తంగా

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



మహబూబాబాద్ అర్బన్: ఏప్రిల్ నెలలో జరగబోయే పదో తరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ డేవిడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని హోలీ ఏంజెల్స్ హైస్కూల్లో సీఎస్‌డీఓలకు ఓరియంటేషన్ ప్రోగ్రాం శుక్రవారం నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. జిల్లాలో 49 రెగ్యులర్ సెంటర్లు, ఒకటి ప్రైవేట్ సెంటర్, కొత్త 50 సెంటర్లలో సీఎస్ 50మంది, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ 50మంది, 533 మంది ఇన్విజిలేటర్లతో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసే విధంగా చూడాలని, ఎగ్జామినేషన్ యాక్ట్‌ను ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో డీఈఓ రామారావు, ఏసీజీ మందుల శ్రీరాములు, ఎంఈఓలు పాల్గొన్నారు.

21న జాబ్‌మేళా

మహబూబాబాద్: జేఎస్‌ఆర్ గ్రూపు సన్‌సిటీ రియాల్టీ ప్రైవేట్ లిమిటెడ్ మహబూబాబాద్‌లో మార్కెటింగ్ మేనేజర్‌గా పని చేయుటకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు ఈనెల 21న జిల్లా ఉపాధి అధికారి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఆపై చదువు చదివి 18 సంవత్సరాలు నిండిన ఆసక్తి గల వారు జాబ్ మేళాకు హాజరుకావాలని కోరారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

రూ.25,116 విరాళం అందజేత



గార్ల: గార్లలోని అంబేడ్కర్‌నగర్‌లో గల రామాలయంలో కల్యాణ మండపం నిర్మాణానికి గంజి.సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన భార్య స్వరాజ్యలక్ష్మి, కుమారులు గంజి రాంబాబు, రవిశంకర్‌లు శుక్రవారం రూ.25,116 విరాళం అందజేశారు.

దంతాలపల్లి: మండలం దాట్ల గ్రామంలో ఈనెల 19న జరగబోయే మాదిగల కులదైవం సవారు లచ్చమ్మ(పెద్దమైసమ్మ) పండుగ సందర్భంగా సర్పంచ్ కొమ్మినేని రవీందర్ శుక్రవారం రూ.20వేల విరాళం నిర్వాహకులకు అందజేశాడు.

పుస్తక దాతలు ముందుకు రావాలి



మహబూబాబాద్: పుస్తక దాతలు ముందుకు వచ్చి పుస్తకాలను అందజేసి బావి తరాల విజ్ఞానానికి దోహదపడాలని జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు అన్నారు. స్థానిక జిల్లా గ్రంథాలయంలో సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పుస్తక సేకరణ కార్యక్రమం చేపట్టగా జిల్లా కేంద్రానికి చెందిన పలువురు 150 పుస్తకాలను చైర్మన్ నవీన్‌రావుకు, కార్యదర్శి టి.శ్రీలతకు అందజేశారు.

సభకు తరలిన నాయకులు

గార్ల: మహబూబాబాద్‌లో నిర్వహించే జనచైతన్య యాత్ర బహిరంగ సభకు శుక్రవారం గార్ల మండలం నుంచి సీపీఎం పార్టీ శ్రేణులు వాహనాల ద్వారా భారీగా తరలివెళ్లారు. మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కవిత, లోకేశ్వరరావు, హరి, రాజారావు, తదితరులు ఉన్నారు.

వర్షం కురిసిన వేళ







జిల్లా కేంద్రంలో శుక్రవారం ఉదయం మోస్తరు వర్షం కురిసింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ఉక్కపోత నుంచి పట్టణ ప్రజలు ఉపశమనం పొందారు. జల్లులు కురుస్తున్న సమయంలో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు గొడుగులు పట్టుకుని వెళ్లారు.

– సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్

అకాల వర్షం.. ఆగమాగం

గార్ల: మండలంలో కురిసిన భారీ వర్షాలకు మిర్చిపంట తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మొక్కజొన్న పంట చేతికొచ్చే దశలో అకాల వర్షం పడటంతో మొక్కజొన్న పంట నేల మట్టమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేలరాలిన మమిడి కాయలు..

డోర్నకల్: పెనుగాలులు, అకాల వర్షంతో మండలంలోని పలు గ్రామాల్లో మామిడి తోటల్లో కాయలు నేల రాలాయి. బూరుగుపాడు శివారులో నందిగామ రాంరెడ్డికి చెందిన మామిడితోటలో గాలులకు 70శాతానికి పైగా కాయలు నేల రాలాయి. అలాగే డోర్నకల్, మున్నేరువాగు, గొల్లచర్ల తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీల్లో అకాల వర్షంతో భారీగా నీరు చేరింది. దీంతో మట్టితో చేసి కాల్చడానికి సిద్ధంగా ఉంచిన ఇటుకలు నీట మునిగాయి. కాల్చడానికి సిద్ధంగా ఉంచిన ఇటుకలు వర్షానికి తడిసి కరిగిపోయాయి. దీంతో తీవ్రనష్టం వాటిల్లిందని బట్టీల నిర్వాహకులు వాపోయారు.

తడిసిన మక్కల రాశులు

కేసముద్రం: మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు కురిసిన అకాల వర్షంతో పలు గ్రామాల్లో మిర్చి, మక్కల రాశులు తడిశాయి. కేసముద్రం మార్కెట్‌లోని ఓపెన్‌యార్డులో రైతులు ఆరబోసుకున్న మక్కలు రాశులు తడిసిన ముద్దయ్యాయి. అప్పటికే అప్రమత్తమైన రైతులు మక్కల రాశులపై టార్పాలిన్లు, పరదాలు కప్పుకున్నారు. అయితే రాశుల అడుగుభాగంలో మక్కలు తడవగా.. రైతులు రోజంతా ఆరబెట్టుకుంటూ ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా ఇళ్లు, కల్లాల వద్ద ఆరబెట్టిన మిర్చి తడిసింది.

అకాల వర్షానికి మిర్చి ఆగమాగం



డోర్నకల్: బూరుగుపాడులో నేలరాలిన మామిడి కాయలు



డోర్నకల్: వర్షానికి తడిసిన ఇటుకలు

చిన్నగూడూరు: అకాల వర్షానికి మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో మిర్చి తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం వేకువజామున కురిసిన వర్షానికి కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి తడిసిపోయింది. వరణుడి దెబ్బకు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు లబోదిబోమంటున్నారు.

తడిసిన మక్క

దంతాలపల్లి: మండల కేంద్రంలో శుక్రవారం కురిసిన అకాలవలతో మొక్కజొన్న రైతులకు తీరని నష్టం జరిగినట్లు పలు గ్రామాల రైతులు వాపోయారు. మొక్కజొన్న పంటతో పాటు మిర్చి, మామిడి తోటలకు అలాగే రబీ సీజన్‌లో వరిపొలాలు పొట్టదశలో నష్టం జరిగాయన్నారు. ఈ వర్షాలతో పలువురు రైతులు నష్టపోయారని రైతుల పంట పొలాలను పరిశీలించి రైతులకు నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని సంబంధిత శాఖ అధికారులను, ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

బయ్యారం: మండలంలోని పలు గ్రామాల్లో మోస్తారుగా కురిసిన వర్షంతో చేతికొచ్చిన మొక్కజొన్న, మిర్చి పంటలను రక్షించుకునేందుకు రైతులు తిప్పలు పడ్డారు.



కేసముద్రం మార్కెట్‌లో తడిసిన మక్కలను ఆరబెడుతున్న మహిళా రైతు



గార్ల: చిన్నకిష్టాపురంలో తడిసిన మిర్చి

బీజేపీ నాయకుల సంబురాలు

మహబూబాబాద్ అర్బన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన ఏవీఎన్ రెడ్డి విజయం సాధించడంపై జిల్లా కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం సెంటర్‌లో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిబోయిన గోపికృష్ణ, చిన్నగూడూర్ అధ్యక్షుడు కొలిశెట్టి నాగేశ్వర్ రావు, నాయకుల కందగట్ల వెంకటేశ్వర్లు, వనం పద్మ, జంపాల సోమయ్య, జిల్లా అధ్యక్షుడు వద్దిరాజ్ రాంచందర్ రావు, పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీను, జిల్లా కోశాధికారి శ్యాంసుందర్ శర్మ, మానుకోట అసెంబ్లీ ఇన్‌చార్జ్ మురళి, తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు ఇచ్చిన తీర్పు హర్షణీయమని బీజేపీ రాష్ట్ర నాయకులు పెదగాని సోమయ్య అన్నారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి గెలుపొందడాన్ని హర్షిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలోసంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, నాయకులు రామ్మోహన్ రెడ్డి, రవిబాబు, కుమార్, టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, పృథ్వీరాజ్, పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలంలో బీజేపీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు సందెల శ్రీనువాస్, నాయకులు పూర్ణచందర్‌రెడ్డి, మురళి, సాయి, రాణిరెడ్డి, పాల్గొన్నారు.



మహబూబాబాద్ అర్బన్: సంబురాలు చేసుకుంటున్న నాయకులు

పశుమిత్రలకు కనీస వేతనం ఇవ్వాలి



అధికారికి వినతిపత్రం ఇస్తున్న బాధ్యులు

మహబూబాబాద్ అర్బన్: గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు వైద్య సేవలు అందిస్తున్న పశుమిత్రలకు కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, పశుమిత్ర యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కొత్త రజినీ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పశుమిత్ర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం డీఆర్డీఏ పీడీకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వేతనం ఇవ్వకుండా పశుమిత్రలతో రాష్ట్ర ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించడం శ్రమ దోపిడికి పాల్పడుతుందన్నారు. ఈనెల 20న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామన్నారు. పశుమిత్రలు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి కొత్త శారద, నాయకులు ఝాన్సీ, శోభ, జ్యోతి, అనూష, నాగమణి, ప్రమీల, యలేంద్ర, అరుణ, అనూష, కవిత, వసంత, పుష్పాంజలి పాల్గొన్నారు.

వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నెహ్రూసెంటర్: ఐకేపీ వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని వీఓఏలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీఓఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. నిర్వహిస్తున్న మూడురోజుల టోకెన్ సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్‌లో శుక్రవారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఓఏలు మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచి, ప్రతినెల బ్యాంకు ఖాతా ద్వారా వేతనాలను ఇవ్వాలన్నారు. వీఓఏలకు రూ.10లక్షల సాధారణ, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు శాభారాణి, మౌనిక, కృష్ణవేణి, శ్రీలత, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, లలిత, పవన్ పాల్గొన్నారు.



మానవహారం నిర్వహిస్తున్న వీఓఏలు

మహిళల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం



కురవి: చిరుధాన్యాలను పరిశీలిస్తున్న సర్పంచ్, సూపర్‌వైజర్

కురవి: మహిళల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయంగా పని చేస్తున్నట్లు నేరడ సర్పంచ్ గుండోజు శ్రీనివాసాచారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వహిదున్నిసాబేగం అన్నారు. శుక్రవారం నేరడ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో గర్భిణిలకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం చిరుధాన్యాల ప్రాముఖ్యత గురించి వివరించారుర. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు హేమలత, రాజేశ్వరీ, కవిత, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలలో మెరుగైన పోషక విలువలు

చిన్నగూడూరు: చిరుధాన్యాలలో మెరుగైన పోషక విలువలు లభిస్తాయని ఐసీడీఎస్ సీడీపీఓ శిరీష అన్నారు. శుక్రవారం మండలంలోని ఉగ్గంపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో మహిళా, శిశు మాసోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బీసు పూలమ్మ, ఎంపీటీసీ భర్తాపురం ఉదయమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

డోర్నకల్: నవజాత శిశువుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని బొడ్రాయితండా సర్పంచ్ తేజావత్ గమ్మిరాజు కోరారు. మండలంలోని బొడ్రాయితండా గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం మానుకోట మహిళా శిశు వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తుమ్మ వెంకటరెడ్డి, ఉపసర్పంచ్ భాస్కర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటరమణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సేవ్రీ, అరుణ పాల్గొన్నారు.

నెల్లికుదురు: మండలంలోని కాచికల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ గుగులోతు శ్రీను, ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయ గర్భిణిలకు, పిల్లలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించి అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మ, అలివేలు, తార, వినోద పాల్గొన్నారు.

పైసా లేదు.. సభకు ఎందుకు రావాలి?

- మండల సభలో ఎమ్మెల్యేను ప్రశ్నించిన సర్పంచ్‌లు

గూడూరు: సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇంత వరకు ఒక్క పైసా దిక్కులేదు, ఏముందని మండల సభకు రావాలి సార్ అంటూ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, బొద్దుగొండ సర్పంచ్ ముక్కా లక్ష్మణ్‌రావుతోపాటు పలువురు సర్పంచ్‌లు ఎమ్మెల్యేను ప్రశ్నించిన సంఘటన గూడూరు మండల సభలో జరిగింది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బానోత్ సుజాత అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి శుక్రవారం ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇప్పటి వరకు జరిగిన మండల సభలకు హాజరు కాని వివిధ శాఖల అధికారులందరూ ఈరోజు హాజరు కాగా, మండలంలోని 39 జీపీల సర్పంచ్‌లలో 9 మంది, ఎంపీటీసీలు 10మంది హాజరయ్యారు. వారి హాజరు శాతాన్ని చూసిన ఎమ్మెల్యే సర్పంచ్‌లకు ఎక్కువైందా.. ఎందుకని రాలేదన్నారు. మండలానికి ఎస్‌డీఎఫ్ నిధులు వచ్చాయి.. వచ్చిన వారికే ఈ నిధులు ఇవ్వమని ఎంపీడీఓ రోజారాణికి ఎమ్మెల్యే సూచించారు. ఆ మాటలు విన్న సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ముక్కా లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. సార్ ఇంటి దగ్గర నుంచి గూడూరుకు రావడానికి కూడా సర్పంచ్‌ల వద్ద డబ్బులు లేవు.. ఎలా వస్తారని అడిగారు. పాటిమీదితండా సర్పంచ్ రాధ జీపీకి రావాల్సిన డబ్బుల వివరాలు రాసి వినతిపత్రం అందించడంతో ఎమ్మెల్యే కంగుతిన్నారు. అధికార పార్టీ వారే ఇలా చేస్తే, ప్రతిపక్ష పార్టీల వారి పరిస్థితి ఏంటని ఎమ్మెల్యే సర్పంచ్‌లను ప్రశ్నించారు. తప్పకుండా మీకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రావాల్సిన నిధులను తొందరలో వచ్చేలా చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం త్వరలో పార్టీ పక్షాన ప్రతీ జీపీలో జరిగే ఆత్మీయ సమ్మేళానికి ఏర్పాట్లు చేసుకోమని సూచిస్తూ బయలుదేరారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ ఎండి. ఖాసీం, తహసీల్దార్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



మండలసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

ఉద్యోగాలు అమ్ముకుంటున్న ప్రభుత్వం

- ములుగు ఎమ్మెల్యే సీతక్క

కొత్తగూడ: ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇచ్చి ఉద్యోగాలు అంగట్లో అమ్ముకుంటున్నారని ములుగు ఎమ్మెల్యే సీతక్క ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. గుంజేడు ముసలమ్మ ఆలయంలో పూజలు చేసి హథ్ సే హథ్ జోడో యాత్ర ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వెనుక ప్రభుత్వ హస్తం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఎన్నో ఆశలతో ఉద్యోగం కోసం కష్టపడి చదిని నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ముద్రించిన కర పత్రాలను పంచుతూ ఇంటింటికి వెళ్లి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే పాకాల సరస్సుపై లిఫ్ట్ ఏర్పాటు చేసి కొత్తగూడ, గంగారం మండలాల్లోని చెరువులు నింపి పంటలకు సాగు నీరందించే విధంగా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ యాత్రలో ఎంపీపీ బానోత్ విజయ రూప్‌సింగ్, ఎంపీటీసీలు జంపయ్య, పుష్పలత, మండలపరిషత్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్, సర్పంచ్ మల్లెల రణధీర్, కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి, నారాయణరెడ్డి, వజ్జ సారయ్య, జాడి వెంకటేశ్వర్లు, మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయలు అమ్మిన సీతక్క

హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని వారాంతపు సంతలో ఎమ్మెల్యే సీతక్క కూర కాయలు కాంటా వేసి విక్రయించారు. వ్యాపారులతో కాంగ్రెస్ పార్టీ ఎజెండా వివరించారు.



జోడో యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే సీతక్క

గ్రామపంచాయతీగా ప్రకటించాలి

గార్ల: మండలంలోని పాతపోచారం గ్రామంను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామస్తులు శుక్రవారం ఎమ్మెల్యే బానోత్ హరిప్రియను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు సూత్రపు రాజు, పుల్లారావు, మహేష్, విజయ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

అండగా ఉంటాం..

తొర్రూరు: బీఆర్‌ఎస్ పార్టీ కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. తొర్రూరు అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ పొనుగోటి సోమేశ్వర్‌రావు తల్లి సుదేష్ణదేవి అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం డివిజన్ కేంద్రంలో మంత్రి ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రమేష్, మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, జెడ్పీటీసీ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ హరిప్రసాద్, చైర్మన్ రామచంద్రయ్యశర్మ, నాయకులు పాల్గొన్నారు.

కళను ప్రోత్సహించాలి

తొర్రూరు: కళలకు ప్రతి ఒక్కరూ ప్రోత్సాహం కల్పించాలని ఎర్రబెల్లి ఛారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ ఉషా దయాకర్‌రావు అన్నారు. చైతన్య కళా సమాఖ్య ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో ఐదు రోజులుగా కొనసాగుతున్న 11వ జాతీయ స్థాయి తెలుగు జాతీయ నాటికల పోటీలు గురువారం రాత్రి ముగిసాయి. ఉత్తమ నాటికలుగా 'గుర్తు తెలియని శవం', 'చీకటి పువ్వు' నాటికలు నిలిచాయి. ఉత్తమ నటులుగా కృష్ణేశ్వరరావు, లహరి, రవీంద్రరెడ్డి, అమృతవర్షిణి నిలిచారు. ప్రతిభ కనబర్చిన వారికి ఉషా దయాకర్‌రావు బహుమతులు అందించారు.

సంక్షిప్త సమాచారం

తపాలా ద్వారా భద్రాద్రి తలంబ్రాలు

మహబూబాబాద్: భద్రాద్రి శ్రీసీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం కోసం తపాలా శాఖద్వారా తలంబ్రాలు నేరుగా ఇంటికి అందిస్తామని తపాలా శాఖ మానుకోట సహాయ పర్యవేక్షకులు ఎల్ సైదానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29వ తేదీ సాయంత్రం 5గంటల వరకు బుక్ చేసుకున్న వారికి అర్చన చేసిన కల్యాణ తలంబ్రాలను రూ.450, ముత్యాల తలంబ్రాలకు రూ.150 చెల్లించవచ్చన్నారు. సమీపంలోని తపాలా కార్యాలయంలో గాని, పోస్ట్‌మన్‌కు గాని నగదు అందించవచ్చన్నారు.

రైతులకు రుణాలు ఇవ్వాలని వినతి

బయ్యారం: మండలంలోని కాచనపల్లి పంచాయతీ పరిధిలోని రైతులకు డీసీసీబీ ద్వారా రుణాలు ఇవ్వాలని ఎంపీపీ చేపూరి మౌనిక ఉమ్మడి ఖమ్మం డీసీసీబీ చైర్మన్ కురాకుల నాగభూషణం ను కోరారు. శుక్రవారం ఖమ్మంలో ఆయనను కలిసిన ఎంపీపీ పంట రుణాలు లేక రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. దీంతో డీసీసీబీ చైర్మన్ రైతులకు పంట రుణాలు ఇస్తామని హామీ ఇచ్చినట్టు ఎంపీపీ విలేకరులకు తెలిపారు.

సన్మానం

కురవి: మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు కాబోయే చైర్మన్ కత్తెరశాల విద్యాసాగర్ శుక్రవారం మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ బజ్జూరి ఉమాపిచ్చిరెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించాడు.

రైతులను ఆదుకోవాలి

బయ్యారం: జిల్లాలో కురిసిన అకాల వర్షం వలన పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు వెంకన్న, వెంకటనర్సు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

పీవైఎల్ కార్యవర్గం ఎన్నిక

గార్ల: పీవైఎల్ మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం గార్లలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీవైఎల్ మండల అధ్యక్షుడిగా వాంకుడోత్ జగన్, ప్రధాన కార్యదర్శిగా మంగీలాల్, కార్యవర్గ సభ్యులుగా సురేష్, నబి, నరేష్, వీరన్న, ఉపేందర్, రత్నం, లాలలను ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ గణేష్ పేర్కొన్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ధరావత్ మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మహబూబాబాద్ అర్బన్: మహబూబాద్ జిల్లా మూవ్‌మెంట్ ఫర్ పీస్ జస్టిస్ నూతన కమిటీ ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాసిం శుక్రవారం తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఎండీ.ఇబ్రహీం ఆలీ, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ ఆదిల్, కార్యవర్గ సభ్యులలో ఎన్నుకున్నామన్నారు.

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శిగా అజయ్‌సారథిరెడ్డి



నెహ్రూసెంటర్: సీపీఐ మహబూబాబాద్ నియోజకవర్గ కార్యదర్శిగా మానుకోట పట్టణానికి చెందిన బి.అజయ్‌సారథిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని అన్నారు.

రాములోరి కల్యాణం



మహబూబాబాద్ రూరల్: శ్రీ సీతారామచంద్రస్వామి, శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి పంచమ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీసీతారామచంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవం గురువారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎంపీపీఎస్ గోపాల్ నగర్ కాలనీ పాఠశాల విద్యార్థులకు కాలనీకి చెందిన మొగిలిచర్ల దామోదర్, వంశీల తండ్రి తులసీదాస్ జ్ఞాపకార్థం శుక్రవారం విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేశారు.

సైడ్ కాల్వలో చెత్త తొలగింపు

డోర్నకల్: వర్షాలతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని డోర్నకల్ మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న పేర్కొన్నారు. శుక్రవారం భారీ వర్షం పడటంతో పలు ప్రాంతాల్లో సైడు కాల్వల్లో చెత్తపేరుకుపోయి వరదనీరు రోడ్డుపై ప్రవహించింది. దీనిపై స్పందించిన చైర్మన్ వీరన్న సిబ్బందితో కలిసి చెత్తను తొలగించి వరదనీటి ఇబ్బందులు తొలగించేలా చర్యలు తీసుకున్నాడు.

'కంటి వెలుగు' శిబిరం ప్రారంభం

చిన్నగూడూరు: మండలంలోని మేఘ్యాతండా గ్రామ పంచాయతీలో రెండో విడత కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ బాదావత్ జ్యోతి శుక్రవారం ప్రారంభించాడు. కార్యక్రమంలో వైద్యాధికారి కరుణాకర్, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎంలు నర్సుబాయి, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

పంటలు పరిశీలించిన ఏఓ

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలో అకాల వర్షం కురియగా మండల వ్యవసాయ అధికారి నారెడ్డి తిరుపతిరెడ్డి శుక్రవారం గ్రామాలు, తండా గ్రామ పంచాయతీల్లో సందర్శించి పంటలను పరిశీలించాడు. పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని ఏఓ తెలిపారు. మొక్కలపై పంట ఉత్పత్తులు ఉన్నప్పుడు వర్షం వల్ల ఏమైనా వాటిల్లిందా అని పరిశీలించామన్నారు.

అక్రమ అరెస్ట్ అన్యాయం

మరిపెడ: నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో శాంతియుతంగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అక్రమంగా అరెస్ట్ చేయడం అన్యాయమని బీఎస్పీ జిల్లా కార్యదర్శి ఐనాల పరశురాములు అన్నారు. నిరుద్యోగులకు న్యాయం చేయాలని దీక్ష చేయడం తప్పా అని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు కొండ్రు పరశురాములు, జినుక కృష్ణమూర్తి, పోలేపాక ప్రవీణ్‌కుమార్, వెంకన్న, బాసునాయక్, తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంతకు వేలం



మహబూబాబాద్: స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం అంగడి (పశుసంత) సంవత్సరం వసూళ్ల కోసం పొందే హక్కు బహిరంగ వేలం, సీల్డ్ టెండర్ నిర్వహించారు. కాగా అంగడికి వి.కుమారస్వామి రూ.15లక్షలకు టెండర్ వేయగా మధుకర్‌రెడ్డి రూ.19లక్షల 60వేలకు టెండర్ వేశారు. చికెన్ వ్యర్థాల సేకరణ టెండర్ నిర్వహించగా శ్రీవినాయక ఎంటర్ ప్రైజెస్ రూ రూ.3,10,000, శ్రీలక్ష్మి నర్సింహప్రసాద్ రూ.3,60,000 టెండర్ కోడ్ చేశాడు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పశుసంతకు మధుకర్‌రెడ్డి, చికెన్ వ్యర్థాల సేకరణ టెండర్‌ను శ్రీలక్ష్మి నర్సింహప్రసాద్ దక్కించుకున్నట్లు తెలిపాడు. టెండర్‌దారులు, కౌన్సిలర్ మార్నేని వెంకన్న, అధికారులు పాల్గొన్నారు.